క్లుప్తంగా

అందరి జీవితాల్లో ఆనందావళి కావాలి

శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యేలు డాక్టర్ గోపిరెడ్డి, బ్రహ్మనాయుడు



నరసరావుపేట / వినుకొండ : నియోజకవర్గ వాసులకు ఎమ్మెల్యేలు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, బొల్లా బ్రహ్మనాయుడులు దీపావళి శుభాకాంక్షలు తెలియచేశారు. దీపాల పండగ అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న సంక్షేమం, అభివృద్ధితో పేద, బడుగు, బలహీన వర్గాల జీవితాల్లో కాంతులు వెదజల్లాలని కోరారు. చెడుపై మంచి సాధించిన విజయానికి నిదర్శనంగా నరకాసురులను ఓడించి మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా ఎంచుకోవాలని సూచించారు.

ప్రభుత్వ ఖాజీగా అనస్‌ఖాన్




చిలకలూరిపేట: పట్టణానికి చెందిన ముఫ్తీ మొహమ్మద్ అనస్‌ఖాన్‌ను చిలకలూరిపేట మండల ఖాజీగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ముస్లింలకు సంబంధించిన వివాహాలు జరిపించి, ధృవీకరణ పత్రాలు అందించేందుకు ఆయనను నియమించటం జరిగింది. ప్రభుత్వ ఖాజీగా ఆయన పదేళ్లపాటు విధులు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా అనస్‌ఖాన్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజినికి కృతజ్ఞతలు తెలిపారు.

రొంపిచర్ల వైద్యాధికారిగా సాయిబాబు



రొంపిచర్ల: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రెండవ మెడికల్ ఆఫీసర్‌గా డాక్టర్ నిమ్మల సాయిబాబు శనివారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు మొదటి మెడికల్ ఆఫీసర్‌గా ఉద్యోగ బాధ్యతలు నిర్వహించిన డాక్టర్ స్వాతి పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసేందుకు వెళ్లారు. ప్రస్తుతం హాస్పిటల్‌లో రెండవ మెడికల్ ఆఫీసర్‌గా ఉన్న డాక్టర్ పోతిరెడ్డి జగన్ నరసింహారెడ్డి మొదటి మెడికల్ ఆఫీసర్‌గా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించి ఆ స్థానాన్ని భర్తీ చేశారు. మొదటి, రెండవ మెడికల్ ఆఫీసర్లుగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన వారిరువురికి వైద్య సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఘనంగా మాసశివరాత్రి వేడుకలు



నకరికల్లు: మండలంలోని నర్సింగపాడు లోని అన్నపూర్ణా సమేత కాశీ విశ్వేశ్వరాలయం, గంగా అన్నపూర్ణా సమేత మరకతలింగా చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో మాసశివరాత్రి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఆశ్వయుజ మాసశివరాత్రి పురస్కరించుకొని ఆయా ఆలయాల అర్చకులు కొమ్మవరపు పవన్ కుమార్‌శర్మ, పమిడిమర్రు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విశేషపూజలు చేశారు. తొలుత స్వామివారికి విశేష ద్రవ్యములతో అభిషేకాలు చేశారు.

పురుగుల మందు తాగి కౌలు రైతు మృతి

పెదకూరపాడు: పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ కౌలు రైతు మృతి చెందిన ఘటన శనివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పెదకూరపాడు ఎస్ఐ వెంకట్రావు తెలిపిన వివరాలు... పెదకూరపాడు గ్రామానికి చెందిన బెల్లంకొండ రమేష్(40)కు ఉన్న 75 సెంట్ల భూమితో పాటు కౌలు చేస్తుంటాడు. ఈ ఖరీఫ్‌కు నాలుగు ఎకరాలు మిరప, ఎనిమిది ఎకరాలు పత్తి కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నారు. రెండేళ్లగా వ్యవసాయంలో ఆశించిన మేరకు దిగుబడులు రాకపోవడంతోరూ.15 లక్షల వరకు అప్పు చేశాడు. ఈ నెల 9వ తేదీన సాయంత్రం ఇంటిలో ఎవ్వరు లేని సమయంలో గడ్డి మందు తాగాడు. నోటి నుంచి నురగరావడంతో గమనించిన కుటుంబ సభ్యులు, చుట్టుపక్కల వారు వెంటనే స్థానికంగా ప్రథమ చికిత్స అందించి మంగళగిరిలోని ఎన్ఆర్ఐకు తరలించారు. చికిత్స పొందుతూ ఈ తెల్లవారుజామున రమేష్ మృతి చెందాడు. భార్య రాధా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతుడికి దీప్తి, తేజ కుమారుడు, కుమార్తె ఉన్నారు.

అయ్యప్ప మాలధారులకు అన్నదానం

మాదల(ముప్పాళ్ల): మండలంలోని మాదల గ్రామంలోని మద్విరాట్ వీరబ్రహ్మేంద్ర స్వామి దేవస్థానంలో అయ్యప్ప మాలధారులకు శనివారం అన్నదానం చేశారు. మొత్తం 41 రోజుల పాటు మాల ధరించిన దీక్షా స్వాములకు అందరికీ సద్ది కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు చెప్పారు. కార్యక్రమంలో ముప్పా శ్రీరాములు, గోగుల అంజిబాబు, కామేపల్లి సాంబశివరావు, కొనగల రామారావు, ఎస్.కె.మస్తాన్‌వలి పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ఆజాద్ కృషి ఎనలేనిది

- పార్టీ కార్యాలయంలో నివాళులు అర్పించిన ఎమ్మెల్యే గోపిరెడ్డి
- వేర్వేరు ప్రాంతాల్లో ఘనంగా అబుల్ కలామ్ ఆజాద్ జయంతి



నరసరావుపేటలో ఆజాద్ చిత్రపటానికి నివాళులు అర్పించిన ఎమ్మెల్యే గోపిరెడ్డి, పార్టీ మైనార్టీ నాయకులు

నరసరావుపేట: దేశంలో విద్యాభివృద్ధిలో మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ కృషి ఎనలేనిదని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కేకు కట్‌చేసి నాయకులు, కార్యకర్తలకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో తొలివిద్యాశాఖామంత్రిగా ఐఐటీ సంస్థలు, యూజీసీ సంస్థను ఏర్పాటుచేసి విద్యాభివృద్ధికి నాందీ పలికారన్నారు. పిల్లలకు ప్రాథమిక విద్యను తప్పనసరి చేసిన ఘతన ఆయనకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో షేక్ కార్పొరేషన్ చైర్మన్ ఆషాబేగం ఖాజావలి, గిరిజన సంక్షేమ కార్పొరేషన్ డైరక్టర్ పాలపర్తి వెంకటేశ్వరరావు, మైనార్టీ జిల్లా కార్యదర్శి సయ్యద్ ఖాదర్‌బాషు, నియోజకవర్గ మైనార్టీసెల్ అధ్యక్షుడు షేక్ ఖాదర్‌బాషు, పట్టణ అధ్యక్షుడు మహబూబు బాషు, వార్డు నాయకులు షేక్ కరిముల్లా, షేక్ ఖాజా, మీరావలి, సయ్యద్ ఖాజా, కరిముల్లా పాల్గొన్నారు.

శాఖా గ్రంథాలయంలో..

నరసరావుపేట ఈస్ట్: జాతీయ ఐక్యతకు, లౌకిక తత్వానికి, మత సామరస్యానికి కృషి చేసిన మహనీయుడు భారతరత్న మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ అని శ్రీనాథ సాహితీ పరిషత్ కార్యదర్శి స్వర్ణ చినరామిరెడ్డి పేర్కొన్నారు. పల్నాడురోడ్డులోని శాఖా గ్రంథాలయంలో శనివారం మౌలానా జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేంద్ర తొలి విద్యాశాఖా మంత్రిగా అబుల్ కలామ్ దశాబ్ద కాలం పాటు పనిచేసి భారత విద్యారంగాన్ని తీర్చిదిద్దారని తెలిపారు. ఆయన జయంతిని జాతీయ విద్యా దినోత్సవంగా నిర్వహించటం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి యడ్లపాటి రాధ, మైనారిటీ నాయకులు జిలాని, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దార్శనికుడు మౌలానా అబుల్ కలాం అజాద్

చిలకలూరిపేట: స్వాతంత్ర్య సమర యోధుడు, దేశ తొలి విద్యాశాఖా మంత్రి మౌలానా అబుల్ కలాం అజాద్ గొప్ప దార్శనికుడని రాష్ట్రీయ జనక్రాంతి పార్టీ అధ్యక్షుడు షేక్ గౌస్ చెప్పారు. ఆర్‌జేపీ కార్యాలయంలో పలు సంఘాల ఆధ్వర్యంలో మౌలానా అబుల్ కలాం అజాద్ జయంతిని శనివారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు షేక్ బాజీ మాట్లాడుతూ దేశ తొలి విద్యాశాఖా మంత్రిగా మౌలానా అజాద్ ప్రతిష్టాత్మక ఐఐటీ వంటి విద్యాసంస్థలు నెలకొల్పారని వివరించారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు అడపా మోహన్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య పోరాటంలో మౌలానా అజాద్ పాత్ర ఎంతో విశేషమైనదని కొనియాడారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు వంజా ముత్తయ్య, షేక్ నాగూర్, షేక్ మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

బొప్పూడి గ్రామంలో..

చిలకలూరిపేటటౌన్: మండలంలోని బొప్పూడి గ్రామంలో ఉన్న జెడ్పీహైస్కూల్లో భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకల్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా మౌలానా చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం హెచ్ఎం బి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ స్వాతంత్ర్య సంగ్రామంలో కీలక పాత్ర పోషించడమే కాకుండా ఉప్పు సత్యాగ్రహం క్విట్ ఇండియా ఉద్యమాల్లోపాల్గొని 10సంవత్సరాలపాటు జైలుశిక్ష అనుభవించారన్నారు. ఆయన జన్మదినాన్ని జాతీయ విద్యాదినోత్సవంగా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. నేటి విద్యార్థులు ఆయననూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు నాగమల్లేశ్వరరావు, శ్రీనివాసరావు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



చిలకలూరిపేటలో అజాద్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న బొప్పూడి హైస్కూల్ ఉపాధ్యాయులు



నరసరావుపేట మౌలానా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న చినరామిరెడ్డి



చిలకలూరిపేటలో అజాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వివిధ పార్టీల నాయకులు

రాష్ట్రానికి జగనన్న సారథ్యం చాలా అవసరం

- ఆయనే తిరిగి ముఖ్యమంత్రి కావాలి
- ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి



ఇస్సప్పాలెంలో సంక్షేమ, అభివృద్ధి పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

రొంపిచర్ల: పార్టీలకు, కులమతాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ నవరత్నాల పథకం ద్వారా సంక్షేమ పథకాలు అందిస్తున్న వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తిరిగి రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని వడ్ల మూడివారిపాలెం గ్రామంలో శుక్రవారం రాత్రి నిర్వహించిన ఆంధ్రప్రదేశ్‌కు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి ఎందుకు కావాలనే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామంలోని సచివాలయంలో ప్రభుత్వం నుంచి ప్రజలకు ఇప్పటి వరకు అందిన సంక్షేమ పథకాలు, లబ్ధిదారుల వివరాలు తెలిపే డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించి మాట్లాడారు.సచివాలయానికి వచ్చిన ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డిని గ్రామంలో రూ.70 లక్షల రూపాయలతో పనుల పూర్తిచేసిన అభివృద్ధి పథకాలను సందర్శించి ప్రారంభించాలని గ్రామస్తులు కోరారు. రూ.10 లక్షల రూపాయలతో నిర్మించిన చర్చి కాంపౌండ్ వాల్‌ను ప్రారంభించారు. అనంతరం రూ. 60 లక్షల రూపాయల వ్యయంతో నిర్మాణాలు పూర్తి చేసుకున్న ఐదు సీసీ రోడ్లను, రెండు సైడ్ డ్రెయిన్‌లను ఆయన పరిశీలించి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. మేము అడగగానే వెంటనే నిధులు మంజూరు చేయించి పనుల పూర్తిచేయించి వాటిని వినియోగంలోకి తెచ్చిన డాక్టర్ గోపిరెడ్డికి ఆ గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం నిర్వహించిన సభలో పాల్గొని మాట్లాడారు. గ్రామంలో ఇప్పటి వరకు రూ.14.53 కోట్ల రూపాయలతో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. డీబీటీ ద్వారా రూ.9.47 కోట్ల రూపాయలు చెల్లించగా, నాన్ డీబీటీ కింద రూ.2.62 కోట్ల రూపాయలు చెల్లించినట్లు తెలిపారు. నాడు నేడు, ఇతర అభివృద్ధి పథకాలకు రూ.2.44 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలు పరచటంలో గత ప్రభుత్వానికి, జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి గల వ్యత్యాసాలను వివరించారు. అర్హులై ఇంకా పథకాలు అందని వారు ఉంటే వారికి వెంటనే పథకాలు అందే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. త్వరలో ఎస్టీ కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేసి నిర్మాణ పనులు ప్రారంభిస్తామన్నారు. చర్చిలో ప్రార్థనలు నిర్వహించారు. వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి, మహాత్మాగాంధీ, పొట్టి శ్రీరాములు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గానుగపంట ఉత్తమ్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు కురుగుంట శ్రీనివాసరెడ్డి, జిల్లా యువజన విభాగం అధ్యక్షులు పడాల సాంబశివారెడ్డి, అన్నెం పున్నారెడ్డి, పచ్చవ రవీంద్రబాబు, ముక్కాల వెంకటరెడ్డి, చపారపు గోపాల్‌రెడ్డి, పడాల చక్రారెడ్డి, బత్తుల రామకృష్ణ, వల్లెపు అంజయ్య, మోతుకూరి వెంకట్, పానుగోటి వెంకట్రావు, కోడూరి వెంకటేశ్వరరెడ్డి, పమ్మి కోటిరెడ్డి, మానుకొండ వాసుదేవరెడ్డి, చపారపు సంజీవరెడ్డి, గెల్లి చినకోటిరెడ్డి, జిడ్డు యర్రయ్య, వీరరాఘవయ్య, గాడిపర్తి సీతయ్య పాల్గొన్నారు.

ఇసప్పాలెంలో...

నరసరావుపేట రూరల్: రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరాలంటే ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డిని మరోసారి అధికారంలోకి తెచ్చుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మండలంలోని ఇసప్పాలెంలో శుక్రవారం రాత్రి ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి గ్రామంలోని ప్రధానసెంటర్‌లో ఏర్పాటుచేసిన వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం గ్రామ సచివాలయంలో సంక్షేమ పథకాల ద్వారా గ్రామస్తులకు అందిన లబ్ధిని వివరిస్తూ ఏర్పాటు చేసిన బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పదముత్తం చిట్టిబాబు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తన్నీరు శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ యాంపాటి వెంకటప్పారెడ్డి, గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు జల్లి శ్రీనివాసరావు, రాధారపు శ్రీనివాసరావు, కొండపల్లి చినకోటయ్య, గుండాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలానికి నూతన బస్సు సర్వీసు ప్రారంభం



నూతన సర్వీసును ప్రారంభిస్తున్న డీఎం కోటేశ్వరరావు నాయక్, వెంకటరెడ్డిపల్లి గోవిందరెడ్డి

వినుకొండ(నూజెండ్ల): గ్రామీణ ప్రాంతాల మీదుగా వినుకొండ నుంచిశ్రీశైల పుణ్యక్షేత్రానికి నూతనంగా ఏర్పాటు చేసిన బస్సు సర్వీసును, సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ డీఎం కోటేశ్వరరావు నాయక్ ప్రయాణికులకు విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని ఆర్టీసి డిపో నందు రాష్ట్ర వైఎస్సార్ టీసీ యూత్ అధ్యక్షులు వెంకటరెడ్డిపల్లి గోవిందరెడ్డితో కలిసి నూతన సర్వీసును ప్రారంభించారు. ఈ సర్వీసు 6 గంటలకు వినుకొండ నుంచి వెల్లటూరు, వెంకటరెడ్డి పల్లి, రాచకొండ, పుల్లలచెరువు, ఎర్రగొండపాలెం, కుంట, దోర్నాల మీదుగా శ్రీశైలం పుణ్యక్షేత్రానికి 12 గంటలకు చేరుకుంటుందన్నారు. మరలా మధ్యాహ్నం శ్రీశైలం నుంచి 12.45కు బయలుదేరి రాత్రి 7 గంటలకు వినుకొండకు చేరుకుంటుందన్నారు. ఆర్టీసీ కల్పిస్తున్న ఈ సౌకర్యాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకొని, ఆర్టీసీ అభివృద్ధికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో అన్న సుబ్బారావు, పులిపాటి రామారావు, రెడ్డి నగేష్, చింత ఆదిరెడ్డి, గ్రంధిశిల హనుమంతరావు, ఆర్టీసీ సిబ్బంది, ప్రయాణికులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలి

నియోజకవర్గ ఎన్నికల అధికారి కందుల శ్రీరాములు



సదస్సులో మాట్లాడుతున్న కందుల శ్రీరాములు

శావల్యాపురం: ఎన్నికల కమిషనర్ ఆదేశాలు మేరకు 18 సంవత్సరాల నిండిన వారందరికీ ఓటు హక్కు కల్పించాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి (ఈఆర్‌వో) కందుల శ్రీరాములు అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బీఎల్‌వోలకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఆర్వో శ్రీరాములు మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామ పంచాయతీలో 34 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, ఆయా పోలింగ్ కేంద్రాల పరిధిలో బీఎల్‌వోలు ఫిర్యాదులకు తావు లేకుండా పారదర్శకంగా తమ విధులు నిర్వహించాలన్నారు. నూతన ఓట్లు చేర్పులు, మార్పులు, తొలగింపులపై వచ్చిన అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా క్షేత్రస్థాయిలో విచారణ చేసి పార్టీలకు అతీతంగా తగిన ఆధారాలు అందజేసిన అర్జీదారులకు సత్వరమే న్యాయం చేయాలన్నారు.బీఎల్‌వోలకు క్షేత్రస్థాయిలో ఏమైనా ఇబ్బందులు ఉంటే అధికారుల దృష్టికి తేవాలన్నారు. డిసెంబరు 9వ తేదీలోగా మార్పులు చేర్పులు తొలగింపులు తదితరవన్నీ నూతన ఓటర్ల జాబితా ముసాయిదాలో పరిష్కారించాలన్నారు. ఈ సమావేశంలో తహసీల్దారు షేక్ జాన్‌సైదులు, డిప్యూటీ తహసీల్దార్లు వేముల వెంకట నాగరాజు, పేరు సోముల నాసరయ్య, ఏఎస్‌వో చెన్నయ్య లు పాల్గొన్నారు.

బొల్లాపల్లిలో ఆశాజనకంగా ఖరీఫ్

- అత్యధికంగా 35.2మి.మీ. వర్షపాతం నమోదు
- 19 వేల ఎకరాలకు పైగా పంట సాగు



రేమిడిచర్లలో సాగుచేసిన మిరప పంట

బొల్లాపల్లి: ప్రస్తుతం కురుస్తున్న వర్షం పంటలకు ఆశాజనకంగా ఉంది. ఈ వర్షంతో రైతులు కొంత ఊరట చెందారు. గత రెండ్రోజుల నుంచి ఒక మోస్తారు నుంచి భారీ వర్షం కురవడంతో మండలంలో పలు గ్రామాల్లో నీటి కుంటలు జలకళలు సంతరించుకున్నాయి. కొన్ని గ్రామాల్లో వాగులు ప్రవహించాయి. దీంతో రైతాంగం ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు కురిసిన వర్షపాతం నమోదులో ప్రస్తుతం 35.2 మి.మీ. అత్యధిక వర్షపాతం నమోదైంది. గత కొంతకాలంగా మండలంలో వర్షాభావంతో భూగర్భజలాలు అడుగంటడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. అయితే ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వలన ఖరీఫ్ పంట సాగు చేసిన రైతులు పంట దిగుబడికి ఆశాజనకంగా ఉందని అంటున్నారు. మండలంలో ఇప్పటి వరకు ఖరీఫ్ సీజన్‌లో 85 శాతం వివిధ పంటలు సాగు చేశారు. మొత్తం 25 వేల ఎకరాలు ఉండగా, 19 వేల ఎకరాలకు పైగా విస్తీర్ణంలో పంటలు సాగయ్యాయి. అత్యధికంగా 14 వేల ఎకరాల్లో మిరప పంట, 1600 ఎకరాల్లో పత్తి, 950 ఎకరాలకుపైగా పొగాకు తదితర పంటలతో పాటు రబీలో 2వేల ఎకరాల శనగ, 600 ఎకరాలకు పైగా మినుము సాగు చేపట్టారని, ఈ మేరకు మండల వ్యవసాయ అధికారి ఎ.అంకారావు తెలిపారు. కురుస్తున్న వర్షం వలన మెట్ట పంటలకు ఎంతో మేలు చేకూరింది. ఈ వర్షంతో కొంత మేరకు భూగర్భజలాలు నీటి మట్టం పెరిగే అవకాశం ఉందని రైతులు భావిస్తున్నారు. మండలంలో రేమిడిచర్ల, గుమ్మనంపాడు, గండిగనుమల, మేళ్ళవాగు, రావులాపురం, మన్నేపల్లితండా తదితర ప్రాంతాల్లో కురుస్తున్న వర్షంతో కుంటల్లో నీరు చేరుకున్నాయి.

అయితే అత్యధికంగా వర్షాలపై ఆధారపడిన మెట్టపంటలతో పాటు బోర్లపై ఆధారపడి సాగుచేస్తుంటారు. ప్రస్తుతం వర్షం వలన ఖరీఫ్ పంట దిగుబడి ఆశాజనకంగా ఉంటుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఏరియా వైద్యశాలకు పల్స్ ఆక్సీ మీటర్లు అందజేత

సత్తెనపల్లి: పట్టణంలోని ఏరియా వైద్యశాలకు వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ ఆధ్వర్యంలో మిత్రుడు నరసరావుపేటకు చెందిన కిరణ్ సహకారంతో శనివారం రూ.10 వేలు విలువ చేసే పల్స్ ఆక్సీ మీటర్స్ అందించారు. వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ బి.లక్ష్మణరావు మాట్లాడుతూ వైద్యశాల అభివృద్ధికి కొత్త రామకృష్ణ ఎంతో సహకారం అందించారని, ఎప్పుడు ఏ చిన్న అవసరమైన స్పందించి వైద్యశాల అభివృద్ధిలో తనదైన ముద్ర వేసుకున్నారని అభినందించారు. కార్యక్రమంలో వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ, హెడ్ నర్స్ వెంకటేశ్వరమ్మ, బయో మెడికల్ ఇంజినీర్స్ చంద్ర, నర్సింగ్ సూపరింటెండెంట్ రాధ పాల్గొన్నారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

నరసరావుపేట ఈస్ట్: పల్నాడురోడ్డులోని శాఖా గ్రంథాలయంలో ఈనెల 14వతేది నుంచి 20వ తేదీ వరకు 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారి యడ్లపాటి రాధ శనివారం తెలిపారు. వారోత్సవాలను పురస్కరించుకుని పాఠశాల, కళాశాల స్థాయి విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వం, జనరల్ క్విజ్, పద్యాలు, రంగోళి తదితర పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజేతలకు ఈనెల 20వతేది వారోత్సవాల ముగింపు సభలో బహుమతులు అందచేస్తామని వివరించారు. పట్టణం , పరిసర ప్రాంతాలలోని పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు, తల్లిదండ్రులు విద్యార్థులు పోటీలలో పాల్గొనేలా ప్రోత్సహించాలని కోరారు. కాగా, వారోత్సవాలను పురస్కరించుకొని దీర్ఘకాలంగా ధరావత్తుదారుల నుంచి తిరిగిరాని పుస్తకాలు వాపసు చేసినట్లయితే అపరాధ రుసుం మినహాయింపు ఇవ్వనున్నట్లు తెలిపారు.

రొంపిచర్ల మండలంలో...

రొంపిచర్ల : మండలంలో సంతగుడిపాడు గ్రామంలో గల శాఖా గ్రంథాలయంలో ఈ నెల 14 నుండి 20 వరకు 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారి కె. వెంకట్రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం రోజున బాలల దినోత్సవం నిర్వహించబడుతుందన్నారు. విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించబడుతుందన్నారు. పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేసి విద్యార్థులకు పుస్తక పఠనం వలన కలుగు ప్రయోజనములు గురించి, వాటి ప్రాముఖ్యత గురించి వివరిస్తామన్నారు. గ్రంథాలయ వారోత్సవాలలో విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

పంచారామాలకు ప్రత్యేక బస్సులు

19, 26, డిసెంబరు 3, 10 తేదీల్లో

నరసరావుపేట: కార్తిక మాసం పర్వదినాలలో డిపో నుంచి రాష్ట్రంలోని శైవ క్షేత్రాలైన పంచారామాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ బత్తుల వీరాస్వామి శనివారం పేర్కొన్నారు. పంచారామాలైన సామర్లకోట కొమారరామం, ద్రాక్షారామం భీమారామం, పాలకొల్లు క్షీరారామం, భీమవరం సోమారామం, అమరావతి అమరారామంలకు ఆదివారం రాత్రి 9గంటలకు బయలుదేరి సోమవారం ఐదు క్షేత్రాలను దర్శించుకొని తిరిగి డిపోకు ఒకేరోజులో చేరుకునే విధంగా బస్సులు ఏర్పాటు చేశామన్నారు. ఈ బస్సులు ఈనెల 19, 26, డిసెంబరు 3, 10 తేదీల్లో డిపో నుంచి బయలుదేరతాయన్నారు. కావున ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని భక్తులను కోరారు. అల్ట్రా డీలక్స్ బస్సు టిక్కెట్ ధర ఒక్కొక్కరికి రూ.1300లుగా నిర్ణయించమైందన్నారు. ఇతర వివరాలకు ఫోన్ నెంబర్ల 7382896041. 7382896038, 99592 25428లను సంప్రదించాలని కోరారు.

20లోగా పదో తరగతి ఫీజు చెల్లించాలి

యడ్లపాడు: పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫీజు ఈనెల 20వ తేదీలోగా చెల్లించాలని యడ్లపాడు ఎంఈవో-2 అరుణకుమారి తెలిపారు. శనివారం ఆమె ఫీజు చెల్లింపు వివరాలను తెలిపారు. రూ. 50 అపరాధ రుసుముతో 25వ తేదీలోగా, రూ.200 అపరాధ రుసుముతో ఈనెల 30వ తేదీ వరకు, రూ.500 అపరాధ రుసుముతో డిశంబరు 5వ తేదీ వరకు చెల్లించే అవకాశం ఉందని పేర్కొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

చిలకలూరిపేటటౌన్: ఏసుక్రీస్తు దివ్యశాంతి నిలయం అధినేత, పాస్టర్ నందమూరి క్రిష్టర్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. కాటూరి మెడికల్ కాలేజీ, నెక్స్ట్ జనరేషన్ సేవ్ ఆర్గనైజేషన్ సహకారంతో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో ఎనిమిది రకాల వ్యాధులకు చికిత్సలు అందించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వివిధ రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో నెక్స్ట్ జనరేషన్ సేవ్ ఆర్గనైజేషన్ సేవా సంస్థ అధినేత శివరామకృష్ణ, కేఎంసీ ఆసుపత్రి వైద్యులు, దివ్యశాంతి నిలయం సిబ్బంది పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు ఆచరించాలి

నాదెండ్ల: సాతులూరు గ్రామంలోని క్రీస్తు కిరణాలు ప్రార్థనా మందిరం రెండో వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. పాస్టర్ జోసఫ్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఏసుక్రీస్తు జీవించిన కాలాన్ని కొలమానంగా తీసుకుంటారని, ఏసుచరిత్ర నాలుగు సువార్తల్లో ఉంది కానీ క్రీస్తు పుట్టిన తేదీ లేదన్నారు. పశ్చిమ దేశాల్లో క్రైస్తవులంతా క్రీస్తు జన్మదినాన్ని డిశంబర్ 25గా ఆనవాయితీగా జరుపుకుంటారన్నారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం అన్నదానం నిర్వహించారు. నార్నె రామయ్య స్థలంలో రెండేళ్ల క్రితం చర్చి నిర్మాణానికి సహకరించిన దాతలను ప్రశంసించారు. ఈ సందర్భంగా చర్చిని విద్యుత్‌దీపాలతో అలంకరించారు. కార్యక్రమంలో స్థానిక చర్చి పాస్టర్ అమ్మామేరి, వివిధ ప్రాంతాల పాస్టర్లు, సంఘపెద్దలు పాల్గొన్నారు.

వృద్ధులకు పండ్లు పంపిణీ

సత్తెనపల్లి: పట్టణానికి ఎడ్యుకేట్ ది సొసైటీ సంస్థ 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు షేక్ అన్సారీ తన మిత్రులు, ఈటీఎస్ సైనికులతో కలసి పట్టణంలోని ఆదరణ వృద్ధాశ్రమంలో కేక్ కటింగ్ చేసి పండ్లు పంపిణీ చేశారు. సంస్థ అధ్యక్షుడు అన్సారీ మాట్లాడతు వృద్ధాశ్రమానికి నిత్యావసరాలు అందచేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల వలంటీర్లు అశోక్, నిఖిల్, సురేష్, భరత్ పాల్గొన్నారు.